క్లుప్తంగా

కూలిన ఇళ్ల సమాచారం ఇవ్వండి: తహసీల్దార్



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

టేక్మాల్(మెదక్): వర్షాలతో కూలిన ఇళ్ల సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ తులసీరాం అన్నారు. మంగళవారం మండలంలోని తంప్లూర్‌లో గ్రామంలో నీరు గ్రామంలోకి వచ్చిన విషయాన్ని తెలుసుకొని సందర్శించారు. నీరు గ్రామంలోకి రాకుండా ఉండాలంటే రోడ్డు గండి కొట్టించారు. గ్రామంలో కూలిన ఇళ్లను సందర్శించి ప్రత్యామ్నాయంగా పాఠశాలల్లో ఉండాలని కూలిన ఇళ్లల్లో ఎవరు ఉండొద్దని సూచించారు. మంజీర నది పరీవాహక ప్రాంత ప్రజలు ఇళ్లలోనే ఉండాలని తెలిపారు. అత్యవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇందులో ఆర్‌ఐ సాయిశ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

నీటి ప్రవాహం పరిశీలన



నందిగామ గ్రామంలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న హన్మంతరావు

నిజాంపేట(మెదక్): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో కూలిన ఇంటి బాధితులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పరామర్శించారు. ఈ మేరకు నందిగామ, కల్వకుంట గ్రామాల్లోని పర్యటించారు. నందిగామ గ్రామంలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా కాల్వలు పూర్తి చేయాలని డీఈని ఆదేశించారు. కల్వకుంట గ్రామంలో భారీ వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలించారు. మండలంలోని కాంగ్రెస్ యూత్ నాయకుడు రాంచందర్ నాయక్ సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన టార్పాలిన్ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంజా మహేందర్, వెంకటగౌడ్, రవీందర్ రెడ్డి, అమరసేనారెడ్డి, నర్సింహరెడ్డి, ఆకుల బాలయ్య, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ పరిరక్షణకు చర్యలు



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఎస్సీ బాలుర సంక్షేమ వసతిగృహ పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రంగంపేట కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు పేర్కొన్నారు. గ్రామంలోని వసతి గృహం గదుల్లో పైకప్పు దెబ్బతినడం, విద్యార్థులు పడుకుంటున్న బెడ్లపైన నీటిదారుల పడుతుండడంపై ఈ విషయం తెలుసుకొని వసతి గృహాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో ఎస్సీ బాలుర సంక్షేమ వసతిగృహ పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. వారిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గొండ కృష్ణ,నాయకులు చందు, వెంకట్ గౌడ్,బాలరాజ్,తదితరులు ఉన్నారు.

అర్హులైన రైతులకు పరిహారం ఇవ్వండి



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌ఐలు

శివ్వంపేట(నర్సాపూర్): ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న అర్హులైన రైతులకు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని పోతులబోగూడలో ట్రిపుల్‌లో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్‌ఐలు కిషన్, సునీల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో 35 మంది రైతులకు సంబంధించి 44 ఎకరాలు సేకరించామన్నారు. రైతులు మాట్లాడుతూ.. పలువురు రైతులకు సంబంధించి పోజిషన్ ఉన్నప్పటికీ రికార్డు పరంగా సర్వే నంబర్లు మరోచోట చూయిస్తున్నందున వాటిని సరిచేసి అసలైన రైతులకు న్యాయం చేయాలన్నారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులను నివేదించి న్యాయం చేస్తామని వారు చెప్పారు.

నిండుకుండలా చెరువులు

మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. వర్షంతో పెంకుటిళ్లు, పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. ఇదే పరిస్థితుల్లో పత్తి, వరి పంటల్లోకి భారీగా నీరు చేరింది.



కౌడిపల్లి(నర్సాపూర్): ముట్రాజ్‌పల్లి చెరువు అలుగు వద్ద గ్రామస్తులు



టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని కాద్లూర్‌లో మునిగిన వరిపంట



శివ్వంపేట(నర్సాపూర్): తాళ్లపల్లితండాలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఉప తహసీల్దార్



వెల్దుర్తి(తూప్రాన్): అప్పకుంట గండి పూడ్చివేసిన ఇరిగేషన్ అధికారులు, రైతులు



నర్సాపూర్ రూరల్: బ్రాహ్మణపల్లిలో దెబ్బతిన్న ఇల్లును పరామర్శిస్తున్న తహసీల్దార్



పాపన్నపేట(మెదక్): జలదిగ్బంధనంలోనే ఏడుపాయల దుర్గమ్మ ఆలయం



కొల్చారం(నర్సాపూర్): పూర్తిస్థాయిలో అలుగు పారుతున్న సైతర చెరువు



అలుగుపారుతున్న పెద్దశంకరంపేట చెరువు



చేగుంట(తూప్రాన్): మక్కరాజీపేటలో..



హవేళఘణాపూర్(మెదక్): మంభోజిపల్లిలో..

గ్రామాల్లో పర్యటించిన రెవెన్యూ సిబ్బంది

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు వర్షం నష్టం తెలుసుకునేందుకు పర్యటించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ యాదవ్ వర్షాలకు కూలిపోయిన ఇళ్ల వివరాలను నమోదు చేసుకొని ఉన్నతాధికారులకు నివేదికను అందించారు. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న పంటలు వర్షం దాటికి నేలకు ఒరిగాయి. పంట నష్టంకు సంబంధించిన వివరాలను వ్యవసాయ అధికారులు నమోదు చేసుకున్నారు.



చిట్టోజిపల్లిలో కూలిన ఇళ్ల వివరాలను నమోదు చేసుకుంటున్న ఆర్‌ఐ నర్సింగ్ యాదవ్



వైభవంగా బోనాల ఊరేగింపు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండలో గ్రామ దేవతలకు గ్రామస్తులు మంగళవారం బోనాలను సమర్పించారు. బోనాలతో పాటు, తొట్టెల, ఫలహారం బండ్లను ఊరేగించి, అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

పాపన్నపేట(మెదక్): గణేశ్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మంగళవారం పాపన్నపేటలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీస్‌శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. డీజే సౌండ్‌లు ఏర్పాటు చేయొద్దని, రాత్రి పది తర్వాత సౌండ్‌లు బంద్ చేయాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ జోలికి వస్తే సహించేది లేదు

నర్సాపూర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ జోలికి వస్తే సహించేది లేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఎమ్మెల్యే సునీతారెడ్డిని హెచ్చరించారు. మంగళవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే హత్నూర, కౌడిపల్లి మండలాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి సీఎంఆర్‌ఆఫ్ చెక్కులు పంపిణీ చేయడం విచారకరమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి, కరుణాకర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సుజాత, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వాగులో చేపల వేట



టీ.మాందాపూర్ వద్ద వాగులో చేపలు పడుతున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. ఇదే సమయంలో వాగుల నుంచి వరద నీరు చెరువుల్లోకి చేరుతుండడంతో చెరువుల్లోని చేపలు ఎదురెక్కుతున్నాయి. దీంతో చేపలను పట్టేందుకు గ్రామాల్లో ప్రజలు పోటీపడుతున్నారు. మంగళవారం టీ.మాందాపూర్ వద్ద మెదక్ రోడ్డు పక్కన ఉన్న బ్రిడ్జి వద్ద వాగులో గ్రామస్తులు వలతో చేపల పట్టారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌ఐ

రేగోడ్(మెదక్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పోచయ్య కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కూలిపోయే ఇళ్ల దగ్గర ఎవరు ఉండకూడదని, ఇళ్లు కూలిపోతే సంబంధిత రెవెన్యూ, పోలీస్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందించాలన్నారు. చెరువులు, దాటే ప్రయత్నం చేయకూడదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 డయల్ లేదా పోలీసులకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

చేగుంట(తూప్రాన్): పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం మాసాయిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌరగల్ల పెంటమ్మ(63) మనస్తాపంతో ఆగస్టు 31న పురుగుల మందు తాగారు. స్థానికుల సమాచారంతో పోలీసులు చికిత్స నిమిత్తం ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **బ్రిడ్జి పరిశీలన**

చిన్నశంకరంపేట(మెదక్): భారీ వర్షంతో వరదనీటితో టీ.మాందాపూర్ వద్ద బ్రిడ్జి కుంగిపోయింది. మంగళవారం మండలంలోని టీ.మాందాపూర్ గ్రామ ప్రధాన రహదారిపై కుంగిపోయిన బ్రిడ్జిని ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్‌తో కలిసి కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు పరిశీలించారు. ఆయన వెంట పీసీసీ నాయకుడు సుప్రభాతరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, ఆశోక్, తదితరులు ఉన్నారు.

◆ **బాధిత కుటుంబాలకు సాయం**

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు యంగ్‌స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. మంగళవారం మెదక్ పట్టణంలోని గోల్కొండ వీధి అంబేడ్కర్ కాలనీలో ఇల్లు కూలిపోవడం వలన ఇబ్బందులు పడుతున్న పదిమందికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు రాగి తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధితులకు టార్పాలిన్ల పంపిణీ**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్, సంకాపూర్ తండాల్లో సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్షంతో దెబ్బతిన్న ఇళ్లపై కప్పుకునేందుకు టార్పాలిన్లను పంపిణీ చేశారు. మంగళవారం సానిక్ష ఫౌండేషన్ చైర్మన్ శివ ఆధ్వర్యంలో బాధితులకు అందించారు.

◆ **కార్మికులకు అండగా కాంగ్రెస్**

మనోహరాబాద్(తూప్రాన్): ఆకస్మాత్తుగా మహికో పరిశ్రమ మూసి వేశారు. దీంతో కార్మికులను రోడ్డున పడటంతో వారికి అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకుడు గోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో మహికో పరిశ్రమ వద్ద కార్మికులు నిరసనలు తెలుపుతుండగా వారికి అండగా కాంగ్రెస్ నాయకులు మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, నర్సింహచారి, శ్రీనివాస్‌గౌడ్, మొహిన్, శ్రీనివాస్, యూనియన్ నాయకులు తదితరులున్నారు.

◆ **'హరీశ్‌రావుపై దాడి చేయడం సరికాదు'**

శివ్వంపేట(నర్సాపూర్): ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై దాడి చేయడం సరికాదని జెడ్పీ కోఆప్షన్ మాజీ మెంబర్ మన్సూర్ అన్నారు.

◆ **ఆలయానికి కోతుల వల ఏర్పాటు**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని హనుమాన్ ఆలయానికి దాత పరంజ్యోతి కోతుల బారి నుంచి కాపాడే వలను ఏర్పాటు చేశారు. ఆలయంలోకి వచ్చిన భక్తులకు నిత్యం కోతులు ఇబ్బందులు పెడుతున్నాయి.ఈ విషయం తెలుసుకున్న పరంజ్యోతి మంగళవారం ఆలయం చుట్టూ కోతులు రాకుండా ఉండేందుకు వలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో భక్తులు ఉన్నారు.

రుణమాఫీకి దరఖాస్తుల స్వీకరణ



నస్కల్ గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



చిన్నశంకరంపేటలో రైతు రుణమాఫీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ విజయ నిర్మల

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మంగళవారం రుణమాఫీకి కుటుంబ సభ్యుల నిర్ధారణకు దరఖాస్తులు తీసుకుంటున్న టుల్ మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 2 లక్షల రుణమాఫీ చేయడానికి రేషన్ కార్డు లేని వారి వద్ద నుంచి కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టా పుస్తకాలతో కుటుంబ సభ్యుల నిర్ధారణకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యసాయ విస్తరణాధికారులు శ్రీలత, రాజు, మౌనిక, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రక్రియ పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): రుణమాఫీ ప్రక్రియను మెదక్ ఏడీఏ విజయ నిర్మల పరిశీలించారు. మంగళవారం చిన్నశంకరంపేట రైతువేదికలో ఏఈఓ ప్రవీణ్‌కుమార్, ఏఈఓలు నిర్వహిస్తున్న రైతు కుటుంబ నిర్ధారణ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దన్నారు. బ్యాంక్ ఖాతాలో తప్పులు దొర్లిన, ఆదార్ కార్డు పేరుతో మ్యాచ్ కాకున్నప్పటికీ రుణమాఫీ లిస్టులో పేర్లు రాలేదన్నారు. రైతు సమస్యలను పరిష్కరించి, అందరికి రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని రైతువేదికలో రైతు కుటుంబ సభ్యుల సర్వే చేశారు. ఈ సందర్భంగా ఏఓ ఝాన్సి మాట్లాడుతూ.. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో రుణమాఫీ కాని రైతు కుటుంబ సభ్యుల వివరాలను పొందుపరుస్తున్నామన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను పరిశీలించిన అనంతరం అర్హులైన రైతులందరికి రుణమాఫీ వస్తుందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉత్తమ్, వందన, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులను మంగళవారం వ్యవసాయ మండలాధికారి కృష్ణ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను, కుటుంబ సభ్యులతో పాటు వారికి సంబంధించి వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచినట్లు వివరించారు. ఈ వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినీత్, మమత తదితరులు రైతులు పాల్గొన్నారు.

కూరగాయలు, చిరుధాన్యాలతో ఆరోగ్యం



కొల్చారం(నర్సాపూర్): మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శశికళ



వెల్దుర్తి(తూప్రాన్): పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సూపర్‌వైజర్ శశికళ

కొల్చారం(నర్సాపూర్): మన పెరటి తోటల్లో పండించే ఆకుకూరలు, కూరగాయలు, ఇళ్లలో లభించే చిరుధాన్యాలు తినడం ద్వారా ఆరోగ్యాంగా ఉంటామని ఐసీడీఎస్ కొల్చారం సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పౌష్టికాహార వారోత్సవాలను పురస్కరించుకొని బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని, బలవర్ధకమైన ఆహారంతో రోగాలు దరిచేరవని తెలిపారు. చిన్నపిల్లలు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే గుడ్లు, పాలు, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, నీరజ, మేఘమాల, స్వరూప, ఆశ వర్కర్లు రాణి, కవిత, ఏఎన్‌ఎం, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పోషణ మాసం.. ఆరోగ్య రక్షణే లక్ష్యం

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజల్లో పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో 1 నుంచి 30 వరకు పోషణ మహోత్సవం నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే మంగళవారం వెల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధి శేరీల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు దేవలత, లక్ష్మి మాట్లాడారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా కాచి, వడబోసిన నీటినే తాగాలన్నారు.

ఆశ వర్కర్స్‌పై అసభ్య ప్రవర్తన

హెల్త్ సూపర్‌వైజర్‌పై ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ వర్కర్స్ మీటింగ్‌కు హాజరైన ఆశ వర్కర్స్‌పై హెల్త్ సూపర్‌వైజర్ అనిల్ డేవిడ్ అసభ్యంగా మాట్లాడాడని ఆశ వర్కర్స్ దేవమ్మ, నాగరాణి, స్రవంతి పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో మీటింగ్ కోసం వేయిట్ చేస్తున్న ఆశ వర్కర్స్‌పై పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అసభ్య పదజాలంతో దూషిస్తూ చేయి పట్టుకొని లాగినట్లు తెలిపారు. మెడపై చేయి వేసి నెట్టివేయడంతో పాటు ఇష్టానుసారంగా తిట్టడంతో మనోవేదనకు గురైన ఆశ వర్కర్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధుకు ఫిర్యాదు ఇచ్చారు. మెడికల్ ఆఫీసర్ పిలిచి మాట్లాడినప్పటికీ అదేతీరులో వ్యవహరించడంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమపై అసభ్య పదజలంతో మాట్లాడిన అతనిపై చట్టరిత్య చర్యలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



ఎస్‌ఐకి ఫిర్యాదు పత్రం అందిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు, ఆశ వర్కర్స్

రంగంపేట గ్రామం తనిఖీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో పారిశుద్ధ్య పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మంగళవారం జెడ్పీ సీఈఓ ఎల్లయ్య గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి కమాన్ వద్ద కల్వర్టు మూసుకుపోవడం, మురికినీరు ప్రధాన రహదారిపై పారుతుంది. మురికి నీరంతా ఉన్నత పాఠశాలలో చేరి చిన్నపాటి నీటి కుంటను తలపిస్తూ ఉండడం గమనించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ప్రియాంకను, పంచాయతీరాజ్ ఏఈని ఫోన్ ద్వారా రప్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



పంచాయతీరాజ్ ఏఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

నత్నాయపల్లిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయ్యపల్లి గ్రామంలో కొన్ని రోజులుగా మురికి కాల్వల నిర్వహణతో పాటు అంతర్గత రోడ్లను శుభ్రం చేయడం లేదు. దీంతో ఈగలు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇప్పటికే వైరల్ ఫీవర్స్, తెల్ల రక్తకణాలు తగ్గి పలువురు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వాటర్ ఫిల్టర్‌తో పాటు పలు వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. మీసాల అశోక్ ఇంటి సమీపంలో ఉన్న మిషన్ భగీరథ వాల్ కోసం ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌లో చెత్త పేరుకుపోయి దుర్గంధంగా తయారైంది. దీంతో తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. వీధిలైట్లు సైతం రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్న పట్టించుకునేవారు కరువయ్యారు. గ్రామ కార్యదర్శితో పాటు ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీఓ వైద్య శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికుల జీతాలతో పాటు చెత్తా సేకరణ ట్రాక్టర్లు ట్రాక్టర్ పాడైపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని వివరణ ఇచ్చారు.



భగీరథ వాల్ ఉన్న మ్యాన్ హోల్‌లో పేరుకుపోయిన చెత్త